నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 31 డిసెంబర్ 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఆధార్ కార్డు నకలు తప్పనిసరి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, డిసెంబర్ 30: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తుతో ఆధార్‌కార్డు నకలు ప్రతిని తప్పనిసరిగా జత చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యారెంటీ పథకాలకు అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు నకలు ప్రతిని జత చేయకున్నా దరఖాస్తు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెల్లవారకముందే..

ఆధార్ కేంద్రాల వద్ద జనం రద్దీ

దండేపల్లి ఆధార్ సెంటర్ వద్ద తెలవారకముందే వేచి చూస్తున్న ప్రజలు

ప్రభుత్వ పథకాలకు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్‌డేట్ కోసం వందలాది మంది వస్తుండడంతో, ఉదయం 6గంటలకు 30 మందికి టోకెన్ ఇచ్చి అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో ఉదయం 4 గంటలకే ఇక్కడికి వచ్చి టోకెన్ కోసం నిరీక్షిస్తున్నారు. వేరే చోట అయితే పది నుంచి పదిహేను రోజులు పడుతున్నదని, ఇక్కడ టోకెన్ దక్కితే ఒక్క రోజులో పని అయిపోతుందని జనాలు చెబుతుండడం గమనార్హం. -దండేపల్లి, డిసెంబర్30

మూడు రోజులుగా వస్తున్న..

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్,30: మాది నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామం. గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని అనడంతో నిర్మల్ పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీకి మూడ్రోజులుగా వస్తున్న. ఇంతవరకు పని కాలేదు. ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఇక్కడే ఉంటున్న. జనం ఎక్కువగా ఉండడంతో వేచి చూడాల్సి వస్తున్నది. మేడిపల్లి నుంచి నిత్యం ఆటోలో వస్తున్న. పొద్దంతా లైన్‌లో ఉన్నా పని అయితలే. టోకెన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందవుతున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తున్నది. రోజుకు రూ. వంద ఖర్చవుతున్నది. హోటల్లో తినాల్సి వస్తోంది. గిట్ల ఒకేసారి ప్రజల్ని ఇబ్బంది పెట్టుడు మంచిది కాదు.
-రాజమణి, మేడిపల్లి

బెల్లంపల్లిలోని అరవింద్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ కేవైసీ చేసుకునేందుకు బారులు తీరిన మహిళలు

ఈకేవైసీ.. హైరానా..

గ్యాస్ ఏజెన్సీల ఎదుట జనం బారులు

- ఉదయం నుంచి చంటి పిల్లలతో మహిళలు, వృద్ధుల నిరీక్షణ
- రూ.500ల సిలిండర్ కోసం చేసుకోవాలనే అపోహ
- ఉజ్వల పథకం కనెక్షన్లకే ప్రస్తుతం వర్తింపు
- మరుగుదొడ్లు, తాగునీరు లేక అవస్థలు

మంచిర్యాల, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈకేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) కోసం గ్యాస్ వినియోగదారులు హైరానా పడుతున్నారు. నేటి (ఆదివారం)తో గడువు ముగుస్తున్నదనే ప్రచారంతో ఏజెన్సీల ఎదుట బారులుదీరుతున్నారు. ఉదయమే వృద్ధులు, పిల్లాపాపలతో మహిళలు పల్లెల నుంచి తరలివచ్చి నిరీక్షిస్తున్నారు. ఐదు నిమిషాల పనే అయినప్పటికీ వచ్చే వారి సంఖ్య వందల్లో ఉండడం, రోజు 700 నుంచి 1000 వరకు ఈకేవైసీ చేయాల్సి వస్తుండడం, సర్వర్ డౌన్ వల్ల ఆలస్యం అవుతున్నదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో వినియోగదారులు గంటల తరబడి బారులుదీరుతున్నారు. కొన్ని ఏజెన్సీల వద్ద మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు.

మంచిర్యాలలోని గద్దెరాగడి భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ కేవైసీ చేసుకునేందుకు బారులుతీరిన ప్రజలు

రూ.500 సిలిండర్‌కు సంబంధం లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.500ల సిలిండర్‌కు, ఈకేవైసీకి సంబంధం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే వర్తిస్తున్నది. ఇందుకు డిసెంబర్ 31వ తేదీ డెడ్‌లైన్ పెట్టింది. దీపం, సీఎస్ఆర్, వ్యక్తిగత కనెక్షన్ల వినియోగదారులు ఎప్పుడు వెళ్లినా ఏజెన్సీల్లో ఈకేవైసీ చేస్తారు. కానీ.. అధికారులు చెప్పినా జనం పట్టించుకోవడం లేదు. నేటితో ఉజ్వల పథకానికి ఈకేవైసీ గడువు ముగియనుండడంతో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీల వద్ద క్యూలైన్లు కనిపించాయి. అసత్య ప్రచారం నమ్మి, తొందర పడి ఎవ్వరూ ఏజెన్సీలకు రావొద్దని అధికారులు, నిర్వాహకులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు

జిల్లా	కనెక్షన్ల సంఖ్య
ఆదిలాబాద్	36,098
నిర్మల్	37,328
మంచిర్యాల	30,322
ఆసిఫాబాద్	23,255
దీపం, సీఎస్ఆర్, వ్యక్తిగత కనెక్షన్లు	7.68 లక్షలు

ఈకేవైసీకి వస్తే సురక్ష పైపులు అంటకట్టిన్రు..

బెల్లంపల్లి, డిసెంబర్ 30 : నా పేరు జ్యోతి. మాది మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని రాంపూర్ గ్రామం. ఉదయం 8 గంటలకు బయలుదేరి బెల్లంపల్లికి 9 గంటలకు చేరుకున్నా. 20 కిలోమీటర్ల దూరం ఉండగా.. రూ.50 చార్జి పెట్టుకొని ఆటోలో వచ్చిన. ఈకేవైసీ చేసుకోవాలని అరవింద్ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూలో నిలబడ్డా. ఈకేవైసీ చేసుకోవాలంటే రూ.200 పెట్టి సురక్ష గ్యాస్ పైపు కొనాలని నిర్వాహకులు అన్నారు. ఉచితంగా చేస్తున్నారు కదా అని అడిగా. పైపు కొంటేనే ఈకేవైసీ చేస్తామని చెప్పారు. నా వద్ద డబ్బులు లేకపోవడంతో మా బంధువుల ఇంటికెళ్లి తీసుకచ్చుకున్నా. పైపు తీసుకొని ఈకేవైసీ చేసుకున్న. మరికొందరికైతే గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు కోసం ఏకంగా రూ.1,300 తీసుకున్నారు. డబ్బులు గుంజుడే గుంజుతున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలేమో గాని మా పైసలన్నీ గుల్ల చేస్తున్నారు.

చాలా ఇబ్బందవుతున్నది..

మాది మామడ మండలం కిషన్‌రావు పేట గ్రామం. వ్యవసాయ కూలీగా పని చేస్తున్న. నిర్మల్‌లో గ్యాస్ కనెక్షన్ ఉంది. గిప్పుడు ఈకేవైసీ చేయాలనే నిబంధన పెట్టడంతో రెండు రోజుల నుంచి తిరుగుతున్నా పని కాలేదు. అటు కూలి పనికి కూడా పోతలేను. రోజూ రూ. 60 ఆటో ఖర్చే అవుతున్నది. చలికాలం కావడంతో ఉదయమే ఊరి నుంచి రావడానికి ఇబ్బందవుతున్నది. గ్యాస్ సెంటర్ వద్దే ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తున్నది. జనం ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నయ్. హోటల్లోనే తినాల్సి వస్తున్నది. గీ నిబంధన ఎందుకు పెట్టిన్రో అర్థమైతలేదు. మేమైతే చాలా ఇబ్బంది పడుతున్నం.
-లలితా రాథోడ్, కిషన్‌రావుపేట

50 రోజుల వరకు టోకెన్లు లేవనే బోర్డు

ఆదిలాబాద్ పట్టణంలోని ఆధార్ కేంద్రాల్లో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు తీసుకోవడం లేదని నిర్వాహకులు బోర్డులు పెడుతున్నారు. ఇంకా.. 50 రోజుల వరకు టోకెన్ల పంపిణీ పూర్తయిందని, తర్వాత వచ్చి తీసుకుని మేము సూచించిన రోజు వచ్చి అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో ఫిల్టర్‌బెడ్ ఉన్న ఆధార్ కేంద్రంలో ఫిబ్రవరి 20వ తేదీ తర్వాత టోకెన్లు ఇస్తామని సూచించారు. దీంతో దరఖాస్తుదారులు చేసేది లేక నిరాశతో వెనుదిరిగి పోతున్నారు.

ఫిబ్రవరి 20వ తేదీ తర్వాత టోకెన్లు ఇస్తామని పెట్టిన బోర్డు

నేను ఎప్పుడైనా చేసుకోవచ్చన్నరు..

మా వీధిలో అందరూ ఈకేవైసీ చేయించుకుంటున్నరు. ఇవాళ లాస్ట్ రోజు అన్నరు. అందుకే పని వదులుకుని మరీ వచ్చిన. ఇక్కడికి వచ్చినంక నాకు ఇంకా టైమ్ ఉందని చెప్తున్నరు. మాది ఉజ్వల కనెక్షన్ కాదు. అందుకని ఎప్పుడు వచ్చినా చేస్తరంట. పని వదులుకుని వచ్చినందుకు బాధగా ఉంది. మా గల్లీలో ఈకేవైసీ టాకే నడుస్తున్నది. రూ.500 సిలిండర్ రావాలంటే వెంటనే చేయించాలని చర్చించుకుంటున్నరు. అంతా అబద్ధమని ఇక్కడికి వచ్చినంక తెలిసింది. - మల్యాల నర్సయ్య, గ్యాస్ వినియోగదారుడు, మంచిర్యాల.

మాట్లాడుతున్న ఆర్కే 6 గని మేనేజర్ తిరుపతి

'అండర్ గ్రౌండ్'లో ఆర్కే 6 టాప్

- 110 శాతం ఉత్పత్తితో మందుకెళ్తున్న గని
- 2023లో పలు అవార్డులు కైవసం
- గని మేనేజర్ తిరుపతి వెల్లడి

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 30: సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూగర్భ గనుల ఉత్పత్తిలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 టాప్ ప్లేస్‌లో ఉందని గని మేనేజర్ ఈ తిరుపతి తెలిపారు. శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్కే 6గనికి 1లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని విధించగా, ఇప్పటి వరకు 1.46 వేల టన్నులు సాధించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 110 శాతం ఉత్పత్తి సాధించి సింగరేణి వ్యాప్తంగా ముందున్నామని తెలిపారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి సహకారంతో ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని, ఇదే స్ఫూర్తితో ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సేఫ్టీ వీక్, ఎస్డీఎల్ నిర్వహణలో సింగరేణి వ్యాప్తంగా ఆర్కే 6 గనికి అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. బొగ్గు సంస్థలకు సంబంధించిన ఇండియా స్టార్ రేటింగ్‌లో జాతీయ స్థాయిలో గనికి 4వ స్టార్ వచ్చిందన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో గని రక్షణాధికారికి బెస్ట్ అవార్డు వచ్చిందని చెప్పారు. అయితే గనిలో కార్మికుల గైర్హాజరు శాతం తమకు ఆందోళన కలిగిస్తున్నదని చెప్పారు. 900 మంది పని చేసే గనిలో 30 శాతం మంది గైర్హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందులో యువ కార్మికులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. 2025 జనవరితో గని జీవితకాలం ముగుస్తుందని, ఆలోగా గనిలో మిగిలిన బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తామని తెలిపారు. గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి కొమురయ్య, పిట్ ఇంజినీర్ శ్యాంకుమార్, సెక్షన్ ఇంజినీర్ మహేశ్, సర్వేయర్ వర్మ, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, అండర్ మేనేజర్లు శ్రీనివాస్, రంజిత్, ప్రశాంత్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఆన్‌లైన్‌లో కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

- ఉమ్మడి జిల్లాలో 17 విద్యాలయాలు
- జనవరి ఆరో తేదీ వరకు గడువు
- ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 30: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదు నుంచి పదో తరగతి వరకు గురుకులాల్లో ప్రవేశానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగం గా ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చే నెల ఆరో తేదీతో ముగియనుంది. ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 17 గురుకులాలు..

మంచిర్యాల జిల్లాలో తొమ్మిది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు ఉన్నాయి. మంచిర్యాల, జైపూర్, కోటపల్లి, బెల్లంపల్లి, కాసిపేట మండలాల్లో బాలుర, బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్, లక్షెట్టిపేటలలో బాలికల గురుకులాలున్నాయి. అలాగే ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో బాలుర, బోథ్, ఆదిలాబాద్‌లలో బాలికల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ), కాగజ్‌నగర్, రెబ్బెనలలో బాలికల, ఆసిఫాబాద్, సిర్పూర్(టీ)లలో బాలుర విద్యాలయాలున్నాయి.

ఒక్కో గురుకులంలో 80 సీట్లు..

ఒక్కో గురుకులంలో 80 సీట్ల చొప్పున 17 గురుకులాల్లో 1,360 సీట్లు ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఒక్కో గురుకులంలో ఎస్సీలకు 65 సీట్లు, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు 15 సీట్ల చొప్పున కేటాయించారు. ఒక్కసారి అడ్మిషన్ పొందితే పదో తరగతి వరకు హాస్టల్ వసతితో కూడిన బోధన ఉంటుంది. బట్టలు, పుస్తకాలు, కాస్మొటిక్ చార్జీలతో పాటు అన్ని వసతులు కల్పించనున్నారు. ఒక ఫోన్ నంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాలి. ఇతరుల ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

లక్షెట్టిపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

పాత జిల్లాను ఒక యూనిట్‌గా...

గురుకులాల్లో చేరేందుకు 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. నాలుగో తరగతి చదువుతున్నట్లుగా ధ్రువీకరణ పత్రాన్ని తప్పకుండా దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పాత జిల్లా(ఆదిలాబాద్)ను ఒక యూనిట్‌గా తీసుకొని ఎంపిక చేస్తాం. ఆసక్తి గల విద్యార్థులు జనవరి ఆరో తేదీలోగా రూ.100 చెల్లించి వెబ్‌సైట్(http: //tswreis.ac.in, http://tgtwgurukulam. telangana. gov.in, http://tgcet.cgg.gov.in) లేదా http://mjptbcwreis. telangana. gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ 1800 425 45678లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.
-కొప్పుల స్వరూపారాణి, ఆర్సీవో, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ, ఆదిలాబాద్

లక్షెట్టిపేట : కేసు పరిష్కరిస్తున్న జడ్జి అసదుల్లా షరీఫ్

రాజీ మార్గమే మేలు

- జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు
- లక్షెట్టిపేట, చెన్నూర్, సిర్పూర్(టీ)లలో నిర్వహణ

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 30 : రాజీమార్గమే మేలని, త్వరగా కేసులు తేలే అవకాశం ఉంటుందని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి పీ రవి సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. 315 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.
లక్షెట్టిపేట, డిసెంబర్ 30: పట్టణంలోని న్యాయస్థానంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా, జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, సీనియర్ న్యాయవాదులు కేతిరెడ్డి భూంరెడ్డి, రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్, నళినీకాంత్, కూడెల్లి అశోక్, ప్రకాశం, గోవిందర్‌రావు, ప్రదీప్, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.
సిర్పూర్(టీ), డిసెంబర్ 30: మండలకేంద్రంలోని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం పలు కేసులు పరిష్కరించారు. న్యాయవాదులు గణపతి, గంట కళ్యాణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి

కెరమెరి, డిసెంబర్ 30: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి అన్నారు. కెరమెరి మండలంలోని మోడి గ్రామంలో ప్రజాపాలన సదస్సుకు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తులో వివరాలు స్పష్టంగా రాసి ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు చాలా సమయం ఉన్నందునా, తొందరపాటు వద్దని ప్రజలకు సూచించారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, ఝరి, మోడి జీపీల సర్పంచులు కుమ్రం నాణేశ్వర్, మోహర్లే సుమన్‌బాయి వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఉమర్ హుస్సేన్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం భట్, ఎంపీడీవో మహేందర్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మజారొద్దీన్, ఏపీఎం జగదీశ్వర్, ఏపీవో మల్లయ్య, ఏఎస్ఐ బాల్‌సింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎండీ మునీర్ అహ్మద్, కార్యదర్శులు వాజీద్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.
మంచిర్యాలటౌన్, డిసెంబర్ 30: మంచిర్యాల మున్సిపాలిటీలోని కాలేజీరోడ్‌లో ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి తనిఖీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ బీ రాహుల్, జడ్పీ సీఈవో నరేందర్‌తో కలిసి సందర్శించారు. నిర్ణీత గడువులోగా ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని, పూర్తి వివరాలను అందులో పేర్కొనాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఏ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మధూకర్, తదితరులు పాల్గొన్నారు.
హాజీపూర్, డిసెంబర్ 30: మండలంలోని ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్, డీఆర్డీవో అధికారి శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్ రావు, జడ్పీ సీఈవో నరేందర్, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్ కుమార్, ఎంపీడీవో అబ్దుల్ హై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, హాజీపూర్ డీటీ హరిత, ఎస్ఐ నరేశ్‌కుమార్, ఏపీవో మల్లయ్య, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, మండల వ్యవసాయాధికారిణి మార్గం రజిత, విద్యుత్ శాఖ ఏఈ మహేందర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ కామేశ్వర్ రెడ్డి, ఆర్ఐలు మంగ, ప్రభు, ఏఈవో కనకరాజు, తదితరులున్నారు.

కెరమెరి: దరఖాస్తు స్వీకరిస్తున్న నోడల్ అధికారి ప్రశాంతి, కలెక్టర్, అదనపు కలెక్టర్